


# సంకెళ్ళు

## అరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి

యువ దీపావళి ప్రత్యేక సంచిక
(1977 నవంబర్ 10)

"ఓ సీతా, నువ్వా?"

ఆశ్చర్యంగా తిరిగి చూసింది సీత, 'ఎవరబ్బా ఈ క్రొత్త ప్రదేశంలో నన్నెరిగినవారు?' అనుకుంటూ.

"నువ్వా రుక్మిణీ మీరు ఈ ఊళ్ళో వుంటున్నారా ఇప్పుడు?" సంతోషంగా అడిగింది చేయి పట్టుకుంటూ.




"ఆఁ. నువ్వు?" నుదుట బొట్టూ, చేతులకు గాజులూ లేని సీతను పరీక్షగా చూస్తూ అడిగింది.

"ఒక ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వచ్చానులే."

"అయ్యిందా?"

"ఆఁ. ఇంటర్వ్యూ ఈ ఉదయమే అయిపోయింది. కానీ, వస్తుందనే ఆశలేదు నాకు" పెదవి విరుస్తూ అన్నది.

"రేపు ఉదయం ట్రెయినుకు వెళ్ళిపోతున్నాను."

"మా యింటికి పద. కొంచెసేపు హాయిగా మాట్లాడుకుందాం."

"ఎందుకులే" మొహమాటంగా అంది."

"అరె! ఇన్నాళ్ళకు కలుసుకున్నాం ఎటూ రేపు వెళ్ళిపోతున్నానంటున్నావ్. ఎక్కడ దిగావు?"

"మా చెల్లెలి యింట్లోనే. దాని భర్తకి ఇక్కడ ఉద్యోగం."

"ఇంకేం, పరాయివాళ్ళైతే ఏమన్నా వాగే భయం వుంది చెల్లెలే కదా?"

సీత విషాదంగా నవ్వింది. "మన గీత బాగుండనప్పుడు ఎవరైనా ఒకలాగే ప్రవర్తిస్తారులే. పద. నీ ఆహ్వానాన్ని ఎందుకు కాదనాలి?"

రుక్మిణి రిక్షాను పిలిచింది.

సీత ఎందుకో బాధపడుతున్నట్లు గ్రహించి సంభాషణ మార్చింది.

"ఇంటర్వ్యూ బాగాచేసావా? ఏం ఉద్యోగానికి?"

"ఏదో.. ప్రశ్నలకు బాగానే చెప్పాననుకో.."

"మరి?"

"ఏం చెప్పను? నా ఖర్మ. నేను కాలేజీలో చదివేప్పుడు ఒకడు వెర్రివేషాలేస్తే బుద్ధి చెప్పానులే. ఈ రోజు ఇంటర్వ్యూ చేసిన అధికారి వాడే, నా ఖర్మకాలి."

"గుర్తుపట్టాడా కొంపదీసి?"

"ఆహా, 'ఎలా వున్నారు? కులాసాయేనా?' అని కూడా అడిగాడు. నాకు తెలుసు. కక్ష తీర్చుకుంటాడు. ఈ ఉద్యోగం నాకు రాదు" విచారంగా అన్నది.

రుక్మిణికి ఈ ప్రసంగం కూడా మార్చవలసిన అవసరం కనిపించింది సీత విచారాన్ని గమనించి.

"ఒక్కతివే వచ్చావా? తోడు ఎవరూ రాలేదా?"

"నాకు...నాకు ఎవరున్నారు రుక్మిణీ తోడు రావడానికీ, నీడ నీయటానికీనూ? నా బ్రతుకు నీకు తెలుసు కదా?"

"మీ అన్నదమ్ములూ వాళ్ళూ.."

"అంతా వున్నారు. అది చిన్నప్పటి మాట. ఇప్పుడు ఎవరి సంసారాలు వాళ్ళవి. నేనెవరిక్కావాలి, నా డబ్బు మినహా?"

"నిజం?" రుక్మిణి ఆశ్చర్యం ప్రకటించింది.

విరక్తిగా నవ్వింది సీత.

"ఇల్లు వచ్చేసంది దిగు."

ముచ్చటగా వున్న చిన్నదీ పెద్దదీ కాని ఇల్లు.

ఉన్న కొద్దిపాటి ఆవరణలోనే అందంగా పూలమొక్కలు.

తాళం తీసి, లోనికి ప్రవేశించుతూ, "రా సీతా" అన్నది ఆప్యాయంగా.

"కూర్చో. త్వరగా కాఫీ తెస్తాను."

సీత వారిస్తున్నా వినకుండా రుక్మిణి వంటింట్లోకి పరుగెత్తింది.

చక్కటి ఫర్నిచర్, రూం కూలర్, నేలపై తివాచీ.

'ఈ సామానూ రుక్మిణి ముఖంలో సంతోషమూ, చలాకీ ఆమె జీవితం చక్కగా, హాయిగా వుందని చెబుతున్నాయి' అనుకున్న సీత మనసు ఈర్ష్యగా, నిస్సత్తువగా మూలిగింది.

ఇద్దరూ కాఫీ తీసుకుంటూ తీరికగా కబుర్లలో పడ్డారు.

"రుక్మిణీ! ఒక్కమాట అడగనా?" సంకోచంగా అడిగింది సీత.

"ఏమిటి?"

"నువ్వు వివాహం చేసుకున్నావా?"

నవ్వింది రుక్మిణి. "నేను చేసుకోలేదు. అదే జరిగింది."

"చిత్రంగా మాట్లాడుతున్నావ్"

"నిజం సీతా!" గత స్మృతులతో బాధ చెలరేగగా బరువుగా నిట్టూర్చుతూ అంది రుక్మిణి.

"నిజంగా నా జీవితంలో అటువంటి అమూల్య సంఘటన జరుగుతుందని నేనేకాదు నన్ను తెలిసిన ఎవరైనా అనుకున్నారా?"

"మరి? ఎలా జరిగింది?" సీత కుతూహలాన్ని అణచుకోలేకుండా వుంది.

రుక్మిణి గతంలోకి చూస్తున్నట్లుగా ఎటో చూస్తూ చెప్పసాగింది.

"నా కుంటికాలుతొ నాకు పెళ్ళే కాదని అందరూ అనుకునేవారు కదూ."

సీతకు కూడా గుర్తు వస్తున్నాయి ఆనాటి సంగతులు.

నిక్షేపంలాంటి రుక్మిణికి పెద్ద జబ్బు చేసి, బ్రతకదనుకున్నారు పదమూడేళ్ళ వయసప్పుడు. ఎలాగో బ్రతికింది కానీ, ఓ కాలు లాక్కుపోయినట్లై నడక చాలా ఘోరంగా మారిపోయింది.

ఆ కుంటి నడకను చూడలేక తల్లీ తండ్రీ రుక్మిణి కంటే ఘోరంగా రోదించేవారు.

సాటి పిల్లలతో ఆడలేక, వారి హేళనలను భరించలేక బయటికి ముఖమే చూపకుండా ఏదో ఓ మూల నక్కి కుర్చునేది రుక్మిణి ఒంటరిగా. క్రమంగా వయస్సు రావడమూ చూస్తూండగానే మించిపోవడమూ కూడా జరిగిపోయింది. పెళ్ళి వయస్సు దాటిపోయింది. ఇక పెళ్ళే కాదు,' అనే గుసగుసలూ, పకపకలూ ప్రారంభమైనాయి బంధుమిత్రులలో.

ఇరవైరెండేళ్ళ రుక్మిణికి వివాహం కాకుండా ఆమె చెల్లెళ్ళిద్దరికీ వివాహమై పోయింది.

"ఆ మాయదారి జబ్బు ఏకంగా దాని ప్రాణాన్నే తీసుకుపోయినా బాగుండును. ఆనాటి ఏడుపుతోటే చెల్లు. ఇలా బ్రతుకంతా ఏడుపు లేకుండా పోయేది" అని రుక్మిణీ తల్లి ఏడుస్తూ చాలాసార్లు విసుక్కునేది.

కన్నతల్లే అటువంటి మాటలనడంతో రుక్మిణి మరింత కుళ్ళికుళ్ళి ఏడ్చేది. బయట నలుగురికీ ముఖం చూపకుండా, ఇంటనైనా తక్కినవారందరిలా నవ్వుతూ త్రుళ్ళుతూ గడపకుండా, ఒంటరిపాటును వరించి ఏదో ఓ మూల నిర్లిప్తంగా గడిపివేసే రుక్మిణికి కాలక్రమాన కొన్ని జీవిత కఠిన సత్యాలు గ్రహింపు అయ్యే సంఘటనలు జరిగాయి.

"అక్కయ్యా, మావారు సినిమాకు రమ్మంటున్నారు. నా చీరలన్నీ సబ్బులో పెట్టేశాను ప్రొద్దున్నే, ఇప్పుడెలాగ? కాస్త ఉతికి ఆరవేసి పెడతావు కదూ?" అని ఒక చెల్లెలు, "అక్కా వీడసలు సినిమా చూడనీయడు. ఇంటిదగ్గర వదిలేస్తాను. త్వరగా అన్నం పెట్టేసి నిద్రపుచ్చుతావుగా?" అని మరో చెల్లెలు అర్థింపు వంటి ఆజ్ఞలను జారీచేసేవారు తరచూ, 'అక్క అంతరాత్మ ఎంత బాధపడుతుందీ' అనే యోచన లేకుండా.

కూతుళ్ళూ, అల్లుళ్ళూ వచ్చారని సంబరంగా హడావుడి పడుతూ పిండివంటలు చేసే తల్లికి రుక్మిణి కూడా తన కూతురేనన్న విషయం అసలు గుర్తున్నట్లే వుండేది కాదు.

"అబ్బబ్బ రుక్మిణీ! ఎందుకే ఎప్పుడూ ఏదో ఓ మూల మ్రగ్గిపోతుంటావ్? కాస్త ఈ పనిలో ఓ చెయ్యి సాయం వేస్తే అరిగిపోతావా?" అని విసుక్కునేది.వచ్చిన బంధువూల్తో బాతాఖానీ వేస్తూ –

"ఆరు కప్పుల కాఫీ చెయ్యి", "నలుగురు భోజనానికి వుంటారు" అని వంటమనిషికి ఆజ్ఞాపించినట్లే ఆజ్ఞాపించేది.

"ఈ చీర పాపకు, ఆ చీర లక్ష్మికి, పెద్ద అల్లుడికి వాచీ, చిన్న అల్లుడిగారికి సూటూ.." అంటూ ఎంచి ఎంచి ఖరీదు చేసి, అపురూపంగా అందించే వస్తువులలో మాత్రం రుక్మిణికి స్థానం వుండేదికాదు.

తండ్రి పరంధామయ్య మాత్రం రుక్మిణిపై జాలితో బాధతో సతమతమై పోయేవాడు.

"అదేమే, రుక్మిణికేది చీర?" అన్నాడు భార్యను ఓ పండగ సందర్భంలో

"లక్ష్మికీ పాపకూ కొన్నావే చీరలు. కోడలికి కూడా కొన్నావ్, మరి రుక్మిణిని ఎలా మరచిపోయావే?" అన్నాడు ఒకసారి సాహసించి.

చికాకుగా చూసింది జానకమ్మ.

"బాగుంది, అత్తింటికి వెళ్ళే ఆడపిల్లలకు అచ్చటా, ముచ్చటా జరపడం ఆచారం. ఏడాదికోమారు వస్తారు పాపం. ఆ మాత్రం అందుకొని వెళ్ళకపోతే అత్తగారి వద్ద చులకన, కోడలికి ఇవ్వకపోతే ఆమె పుట్టింటివారి ముందు తేలిక అవుతాం. రుక్మిణికీ నాకూ ఎందుకూ? ఏటెల్లకాలం ఇక్కడే పడి మేసేవాళ్ళమేగా?"

శరీరమంతా వెయ్యి సూదులతో గ్రుచ్చినట్లే అనుభవమైంది రుక్మిణికి.

రాను రాను వదిన కూడా రుక్మిణిని దాసిగా చూడనారంభించింది.

"ఈ పిల్లలు తెల్లవార్లూ నిద్ర వుండనీయరు, కాస్త నీ దగ్గర పడుకోబెట్టుకో రుక్మిణీ."

"ఈ రోజు మా బంధువులొస్తున్నారు. వాళ్ళ ఎదుటికి రాకు. అసహ్యంగా వుంటుంది."

"నేను బజారుకి వెళ్తున్నాను. కాస్త పిల్లల స్నానాలవీ చూడు."

"ఈ రోజు మీ అన్నయ్య పది దాటాక వస్తారు, నువ్వు భోజనం పెట్టేయి, నన్ను లేపవద్దు, మధ్యలో మెలుకువ వస్తే మరలా నిద్రపోలేను."

ఈ తరహా తలకుమాలిన ఆజ్ఞాపాలనలు చేసి చేసి విసుగెత్తిపోయింది రుక్మిణి.

'తనదీ' అంటూ ఒక ఇల్లూ వాకిలీ లేనివారు తమ వారికే ఎంత బరువుగా అనిపిస్తారో తెలిసి వచ్చింది ఆమెకు.

'ఏం చేయాలి? ఈ పరాధార జీవనం నుండి విముక్తి ఎలా సాధించను?' రేయింబవళ్ళూ ఆలోచించసాగింది.

ఒకనాడు తండ్రి వార్తా పత్రికలోని విశేషం వినిపించాడు.

ఒక గుడ్డి అబ్బాయి ఎమ్మే పరీక్ష ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడట.

ఇది విశేషం కాదు – అత్యద్భుతంగా తోచింది రుక్మిణికి. కళ్ళులేని కబోదులే అంత ప్రయోజకత్వంగా బ్రతుకుతూంటే తనకేమొచ్చె? ఒక్క కాలు కాస్త కుంటి. అంతేగా? నవ్వేవాళ్ళని నవ్వనీ, ఏడవనీ, నాకేం? నేనేం తప్పు చేశానని ఇలా క్రుంగిపోవడం?

ఈ తర్కవితర్కాల అనంతరం ధైర్యం పుంజుకున్నది మనసు. చదువుకుని తన కాళ్ళపై తను నిలబడాలనే పట్టుదల కలిగింది. 'ఇప్పుడేం చదువు వయసు మించిపోయింది' అనే వంకర మాటలను సరుకు చేయలేదు.

ఒకే ఒక్క వ్యక్తి రుక్మిణి నిర్ణయానికి హర్షామోదాలను ప్రకటించాడు.

ఆయన పరంధామయ్య.

"చదువుకోమ్మా. చాలామంచి నిర్ణయం తీసుకున్నావ్ ఇప్పటికైనా. కలకాలం నేను బ్రతికి ఉండను నీ ఆలనాపాలనా చూడటానికి. మిగిలిన వాళ్ళు చాకిరీ అయితే చేయించుకుంటారు కానీ నీపై ప్రేమ ఎవరికీ?"

తాను పనిచేస్తున్న నైట్ కాలేజీలోనే చేర్పించాడు పరంధామయ్య.

ఎక్కడెక్కడో ఏవేవో ఉద్యోగాలు చేసుకుంటూ, రాత్రి ఇక్కడ చదువుకోటానికి వచ్చేవారే అందులో చాలామంది. అందువల్ల కాస్త జీవితమూ, బాధ్యతలూ తెలిసినవాళ్ళే యించుమించుగా అందరూ. కుర్రకారుకు మల్లే ఆడపిల్లలను ఏడిపించీ, పీడించీ వినోదించే రకాలు కాకపోవడం, తన తండ్రికూడా అక్కడే ఉద్యోగం చేయడం రుక్మిణి ప్రాణానికి చాలా హాయిగా ఉంది.

రోజులు గడుస్తున్నాయి.

చదువు బాగానే వస్తోంది రుక్మిణికి.

'చదవాలి, పాసవ్వాలి, ఉద్యోగం చేయాలి ' అహరహం ఆమె మనసున అదే దీక్ష.

పీ.యూ.సీ పరీక్షలు జరుగుతున్నాయి.

తండ్రికి వారం రోజులుగా జ్వరం వస్తున్నందున రుక్మిణి ఒక్కతే వెళ్ళి వస్తోంది పరీక్షలకు...

"అంతవరకు నాకూ తెలుసు. ఆ తర్వాత మేము ఆ ఊరినుంచి వెళ్ళిపోయాం" అంది సీత,

"ఆ తర్వాతనే నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. అదృష్టం వరించింది."

"ఆశ్చర్యంగా వుంది."

"ఆశ్చర్యమే, తలచుకుంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది. ఒకనాడు పరీక్ష వ్రాయడానికి వెళ్ళేసరికి ఏ గొడవా లేదు. పట్టణం ప్రశాంతంగానే వుంది. అంతలో ఎక్కడో ఏదో విపరీతం జరిగిందట. ఘోరమైన అల్లరి ప్రారంభమైంది ఎక్కడి కక్కడే, బస్సులూ రిక్షాలూ ఆపి తగలబెట్టేస్తున్నారు. రాళ్ళు విసురుతున్నారు. ఏవేవో నినాదాలు వినవస్తున్నాయి. ఎవరికి వారే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని పారిపోతున్నారు.

"కానీ ఈ కుంటిది ఎక్కడకు పారిపోగలదు? నా అవిటితనాన్నీ, అభాగ్యతనూ నిందించుకుంటూ, దైవం మీద భారం వేసి, ఆ స్కూలు ఆవరణలోనే ఓ చెట్టు క్రింద కూలబడ్డాను. 'ఎలాగో సందులూ, గొందుల్లో పడిపోదాం ఇళ్ళకు. మెయిన్ రోడ్డుమీదా, పెద్ద పెద్ద వీధుల్లోనే ఎక్కువ అల్లర్లు,' అని తమలో తాము చెప్పుకుంటూ హడావుడిగా వెళ్ళిపోతున్నారు అందరూ. వారిలో కొందరికి సైకిళ్ళున్నాయి, అందరికీ చక్కటి కాళ్ళున్నాయి గబగబా నడవటానికీ, పరుగులు పెట్టడానికీ.

"అందరూ వెళ్ళిపోతున్నారు. ఒంటరిగా మిగిలిన నాకు దుఃఖం ఉప్పెనగా వచ్చింది. 'నా దారి ఏమిటి? నాన్నగారు పుట్టెడు జ్వరంతో పడివున్నారు. రాలేరు నాకోసం. అన్నయ్యతన ఆఫీసునుండి ఇంటికి పారిపోయే దారి వెతుక్కుంటాడు కానీ నేను జ్ఞాపకం వుంటానా?'

"మీరు.. ఎక్కడికి వెళ్ళాలండీ?"

ఎవరో అడుగుతున్నారు. కళ్ళు తుడుచుకుని చూసాను.

అతడు.. నేను చదివే స్కూల్లోనే పనిచేస్తున్నాడు.

ముఖ పరిచయం వుంది.

"మీ ఇల్లెక్కడండీ?" సైకిల్ దిగి నిలబడి అడుగుతున్నాడు.

'చాలా దూరం ' అన్నాను డగ్గుత్తికతో.

'రండి, సైకిల్‌పై తీసుకెళ్తాను ' అంటున్నాడు.

నాకు అతి ఆశ్చర్యం అనిపించింది.

ఇది కలా, నిజమా?

అందమైన అమ్మాయిలను హాయిగా పలకరిస్తారు, తీయగా స్నేహం చేసి వెంట తిప్పుకుంటారు.

కానీ అవిటిదీ. అనాకారిదీ అయిన నాలాంటిదాన్ని కూడా యింత సస్నేహంగా పలకరించే సహృదయులున్నారా? ఇతడు మనిషా, దేవుడా?

'ఆలోచించితే లాభం లేదండీ. ఇలాంటి రోజున చాలా ప్రమాదాలు జరుగుతాయి. ఇటువంటి పరిస్థితులలో ఒక్క రిక్షా కూడా దొరకదు. బస్సులు సరేసరి. ఆడవాళ్ళు ఒక్కళ్ళూ ఇక్కడ కూర్చోవడమూ మంచిదికాదు. ఒంటరిగా వెళ్ళడమూ క్షేమం కాదు, రండి, సైకిల్ వెనుక సీటుపై కూర్చోండి.'

ఒక్క కృతజ్ఞతా వాక్యం పలుకటానికైనా నా గొంతు లేవదేం?

సదా అనాదరణనూ అపహాస్యాలనే రుచిచూస్తోన్న నేను నేడూ యింతటి ఆదరణకు తల మునకలుతూ తట్టుకోలేకుండా వున్నాను. ఏవేవో ఆలోచనలతో కొట్టుకుపోతున్నాను.

ఆత్రంగా ఎదురుచూస్తున్న అమ్మా, నాన్నగారూ ఆయనకు ఎన్నో కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నాన్నగారికైతే కళ్ళు నీరు కారిపోయాయి.

"శంకరం నీ మేలు ఎలా మరవను? నువ్వే లేకుంటే ఈనాడు రుక్మిణి ఏమైపోయేది? అంటూ మరీ మరీ కృతజ్ఞతలు చెప్పారు ఆయన చేతులు పట్టుకుని.

'ఈ మాత్రం దానికేనాండీ' అంటూ ఆయన సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

'ఈ రోజు ఎవడో పుణ్యం కట్టుకున్నాడు కనక సరిపోయింది. మరో రోజు? ఈ మహాపట్టణంలో గొడవలకేమీ కొదవలేదు. ఈ కుంటిదానికి ఇప్పుడు చదువొకటి తక్కువైంది, నోరు మూసుక్కూర్చోమను ఇంట్లో" అంటూ అన్నయ్య తారాపథానికి ఎగిరాడు తర్వాత.

అమ్మకూడా అతడికి వంత పాడింది. కానీ నాన్నగారి అండ నాకు వుంది.

ఆనాటి సంఘటన తర్వాత శంకరంతో నాకూ, నాన్నగారికి కూడా చనువు పెరిగింది.

క్రమంగా ఒకరి స్వవిషయాలు ఒకరు తెలుసుకునే స్థాయికి పెరిగింది స్నేహం.

అప్పుడప్పుడూ యింటికి కూడా వస్తూండేవాడు.

అందువల్ల మా యింటి విషయాలూ, యింటిలో నా పరిస్థితీ కూడా అతడికి అవగాహనే.

ఒకరోజు మాటలలో నాన్నగారు అతడిని అడిగారు.

'మంచి చదువు వుండి ఈ నైట్ కాలేజీలో ఇంత తక్కువ జీతపు చిన్న ఉద్యోగం ఎందుకు చేస్తున్నావ్?' అని.

అందుకు ఆయన చెప్పిన మాటల సారాంశం – ఒక కాలేజీలో ఆయన ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేసేటప్పుడు ఒక బాల వితంతువు ఆయన స్టూడెంట్ అట. ఇంటర్మీడియెట్ చదివేదట. 'వితంతువైతేనేం? బుద్ధిమంతురాలు' అనుకున్న

ఈయన ఆమెను ఉద్ధరించే సదుద్దేశంతో ఒక ఉత్తరం వ్రాస్తే ఆ అమ్మాయి అపార్థం చేసుకుని అది ప్రిన్సిపాల్‌కు చూపడమూ, ఫలితంగా ఈయన ఉద్యోగం పోవడమూ జరిగిందట.'

"అన్నట్టు.. రుక్మిణీ ఆయన పేరేమిటి?" వింటూన్న సీత ఆందోళనతో కూడిన కుతూహలంతో అడిగింది.

"శంకరరావుగారు. ఏం?"

"ఏమీ లేదు. నాకు తెలుసు ఈ విషయం" నీరసంగా పలికింది.

"అలాగా?"

"ఆఁ నేను కాలేజీలో చదువుతుండగా అక్కడే జరిగింది ఈ విషయం. ఆయన ఒక గొప్ప దేశ భక్తుని కుమారుడు. తనకు సంఘసంస్కరణ అంటే యిష్టమనీ, అది చేతలలో చూపటానికి, ఆ బాలవితంతువును వివాహమాడి, ఆ విధంగా తన జన్మ ఒక వ్యర్థ జీవితాన్ని సార్థకం చేసిందన్న సంతృప్తిని పొందుతాననీ వ్రాశాడు ఆ ఉత్తరంలో. కానీ, మూఢాచారాలలో పెరిగిన ఆ పిచ్చిది పునర్వివాహం ఘోర విషయంగానూ తానొక నిష్టాపరురాలననీ అనుకుని అతడి బ్రతుకుని అల్లరిపాలు చేసి వదిలిపెట్టింది."

"ఆఁ ఆఁ సరిగ్గా అలాగే జరిగిందట. నీకెలా తెలుసు ఈ వివరాలన్నీ?" ఆశ్చర్యంగా అడిగింది రుక్మిణి.

సీత వినిపించుకోలేదు. తన ధోరణిలోనే చెప్పసాగింది.

"అతడు నిజంగా సంస్కరణాభిలాషీ, సహృదయుడే గనుక, వివాహమే కాదనుకున్న నీపై సానుభూతితో నన్ను స్వీకరించాడు."

"ఔను సీతా! ఆడపిల్లల వివాహాలు సమస్య అయిన ఈ రోజులలో ఇక ఈ అవిటి పిల్లకి వివాహమెలా ఔతుంది?" అని నాన్నగారు అందరి ఎదుటా వాపోవడం నేనెరుగుదును. ఆయనతో కూడా అలాగే అన్నారు ఓనాడు. లోపలి గదిలోనుండి నేను వింటూనే వున్నాను.

అసలు సంగతి ఆనాడు ఇంట్లో పెద్ద గొడవ జరిగింది. నాన్నగారికి ఇన్సూరెన్స్ డబ్బు ఓ పదివేలు వచ్చింది.

"నేను బిజినెస్ చేస్తాను ఆ డబ్బుతో" అన్నాడు అన్నయ్య.

"వద్దు. బాంకిలో వేసుకుందాం. ఈ ఏడు మీరు రిటైర్ అవుతారు. మన బ్రతుకులేకాక జన్మంతకూ ఈ గుదిబండ ఉంది మన గుండెలపై. మూడు బ్రతుకులూ ఎలా వెళ్తాయి? డబ్బు వాళ్ళకిచ్చి వాళ్ళపై ఆధారపడటం ఎందుకు?" అంది అమ్మ.

వదిన తారాజువ్వలా లేచింది.

"అయితే ఆ కుంటిదానికి ఆ డబ్బంతా ధారపోస్తారన్నమాట? సరే, ఇక మీకు కొడుకూ, కోడలూ లేరనుకోండి. ఆ కుంటిదే ఉద్ధరిస్తుంది, అదే తల కొరివి కూడా పెడ్తుంది" అని నానా మాటలూ అంది.

అమ్మకే నేనంటే విసుగు, 'ఈ గుదిబండ ' అనేదిగానీ నా పేరు రుక్మిణి అని గుర్తు వుండేది కాదు.

ఇక మరి వదిన ఎందుకు ఖాతరు చేస్తుంది?

ఆమె భాషలో నా పేరు ఎప్పుడూ 'కుంటిది!'

సరిగ్గా ఆ సమయంలో శంకరం గారు వచ్చారు. నాన్నగారితో స్కూలు విషయాలు ఏవో మాట్లాడటానికి. అన్నీ ఆయన విన్నారు.

అసలే వృద్ధాప్యం దానికి తోడు రోజూ యింట ఘర్షణలూ, గొడవలూ.

నాన్నగారు కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు కాఫీ ఇవ్వడానికి వెళ్ళిన నన్ను చూసి.

శంకరంగారు నావైపు ఆర్ద్రంగా చూస్తూంటే నేను తల వాల్చుకున్నాను అపరాధిలా.

లోపలికి పారిపోయాను, ఆయన కూడా అన్నీ విన్నారే అనే సిగ్గుతో, అవమానంతో.

"మాష్టారూ" నెమ్మదిగా వినిపించింది శంకరంగారి కంఠం.

"రుక్మిణిని ఇతర కులంలో వివాహం చేయటానికి మీకేమైనా అభ్యంతరమా?"

నాన్నగారు విషాదంగా నవ్వారు.

"అంత ఉదారులు ఉన్నారని అనుకోను, ఏ కులంలోనైనా సరే."

"ఉన్నారు."

"ఎవరు?"

నాన్నగారి కంఠంలో ఆత్రత, "వుంటే అతడు భగవంతుడే అనుకుని కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తాను. కులం ఉద్ధరించిందా? నా కష్టాలను కడతేర్చగలదా? ఆ పిల్లకు ఈ చెర విడిపించనిదే నేను శాంతిగా చావలేను. నేను లేకుంటే దానిని అందరూ యిలాగే కాకుల్లా పీక్కుతింటారు."

ఆవేశంగా అనేశారు నానంగారు.

"అంత పెద్ద పొగడ్త క్కర్లేదు పరంధామయ్యగారూ. నేను రుక్మిణిని చేసుకుందామనుకుంటున్నాను."

"ఆఁ సంతోషం బాబూ సంతోషం. ఇంతకంటే నా జీవితానికి ఆనందమైన విషయం ఏముంటుంది? నువ్వు ఎటూ ఒక మనసున యిగిరిపోయిన ఆశలను చిగురింపచేసి, ఆ జీవితంలో ఆరిపోయిన దీపాన్ని వెలిగించాలనుకున్నావ్. రుక్మిణి జీవితంకూడా అటూవంటిదే. ఆ శిధిలమైన హృదయంలో నిరాశను తరిమివేయి. మా జీవితాలకు శాంతిని ప్రసాదించు.

ఫలితంగా మా వివాహం జరిగింది.

మా అదృష్టం కొలదీ, ఆ తర్వాత మాకొక లాటరీలో డబ్బు కలిసి వచ్చింది. దాంతో ఒక పెద్ద బట్టల దుకాణం ప్రారంభించారు. ఇప్పటికీ ఆయన మనసులో ఆ దయా, మార్దవాలు అలాగే వున్నాయి స్త్రీలపట్ల. దుకాణంలో సేల్స్ గర్ల్స్‌గా

గుమాస్తాలుగా అందమైన హుషారైన అమ్మాయిలను వెదికి వెదికి నియమిస్తారు వ్యాపారస్థులంతా. తద్వారా వర్తకం బాగా అభివృద్ధి చెందుతుందని. కానీ, ఈయన మాత్రం ఇతరత్రా ఉద్యోగాలు చేయలేని నీరసస్థులకూ, వికలాంగులకూ, వితంతువులకూ వెదకి వెదకి మరీ యిస్తారు ఉద్యోగాలు."

అంతా వింటూన్న సీత దీర్ఘంగా నిట్టూరిచింది.

"నువ్వు అదృష్టవంతురాలవు రుక్మిణీ. జీవితంలో అవకాశాలు ఎల్లప్పుడూ రావు. రాకరాక వచ్చిన అమూల్యావకాశాన్ని నీవు అవివేకంగా అనిమానించి త్రోసిపుచ్చలేదు. మూఢ నమ్మకాలతో నిన్ను నీవు బంధించుకోకుండా అవకాశాన్ని హాయిగా అందుకున్నావు. అందుకే యింత సుఖంగా, సంతోషంగా వున్నావ్."

"నిజం సీతా, 'కులాంతర వివాహం నిషిద్ధం' అంటూ మూర్ఖంగా అమ్మా, అన్నయ్యా బంధువర్గం అంతా సణిగినా, ఎవ్వరినీ లెక్కచెయ్యకుండా మా వివాహం జరిపించారు నాన్నగారు. లేకుంటే నా గతి ఏమయ్యేది? అందరి ఇళ్ళలో దాసీదానిలా బ్రతకవలసిందేగా?"

"ఔను, శంకరంగారిని మొదట తృణీకరించిన ఆ వితంతువు అలాగే బ్రతుకుతోంది అందరికీ భారంగా, విదిలింపులూ, ఛీత్కారాలు సహించుతూ. ఆనాడు శంకరం గారు అందీయబోయిన అవకాశాన్ని అందుకోకుండా మూర్ఖంగా ప్రవర్తించినందుకు నేడు ఆమె చింతంచని క్షణం లేదు. జీవచ్ఛవంలా బ్రతుకుతోంది."

"నీకు తెలుసా ఆవిడ?" రుక్మిణి కుతూహలంగా అడిగింది.

"ఆఁ పోనీయ్‌లే, ఇక ఆ గొడవెందుకు? మరి నేను వెళ్తాను" అంటూ లేచింది.

"అరె! తొందరేం? భోజనం చేసి సాయంత్రం వెళ్దువుగాని."

నీరసంగా నవ్వింది సీత, "అంత స్వేచ్ఛ లేదు రుక్మిణీ నాకు, మా చెల్లెలికి కోపం వస్తుంది. 'నీకోసం వండిన వంట ఏ గోతిలో పోయను? నువ్వేమయ్యావో అని హడలి ఛస్తున్నాను' అంటూ నివాళులు పడ్తుంది. ఇప్పటికే ఆలస్యమయిపోయింది."

సీతను వీధి గేటువరకూ సాగనంప వచ్చింది రుక్మిణి.

"రిక్షా!"

దారిన వెళ్ళే ఖాళీ రిక్షాను పిలిచి బేరమాడుతోంది సీత.

అతడు రెండు రూపాయలు అడుగుతున్నాడు.

ఆమె రూపాయిన్నర అంటోంది.

"అన్నట్టు.. అదుగో మా కారు వచ్చేసింది సీతా, దా ఆయనే దిగబెట్టి వస్తారు" అంటోన్న రుక్మిణి మాటలకు సీత అదిరిపడి చూసింది.

వీధి మలుపు తిరిగి వస్తోంది కారు అప్పుడే.

రుక్మిణివేపు చూడనైనా లేదు సీత.

"సరే, రెండూ యిస్తాను పద త్వరగా."

ఎవరో తరుముకు వస్తూన్నట్లే రిక్షా ఎక్కేసింది.

"అయ్యో, మా వారిని పరిచయం చేస్తాను. కొంచెం ఆగు సీతా."

రుక్మిణి మాటలు వినిపించనట్లే సాగిపోయింది రిక్షా.

"ఏమిటి సంగతి? వీధి గేటులోనే నిలబడ్డావ్, నాకోసమేనా ఈ నిరీక్షణ?" అంటూ కారు దిగాడు శంకరం.

కనుమరుగై పోతూన్న రిక్షాను చూపుతూ అంది రుక్మిణి, "మా వూరు అమ్మాయే సీత అనీ.. ఏదో ఇంటర్వ్యూకి వచ్చిందట, బజారులో కనిపిస్తే తీసుకొచ్చాను, మిమ్మల్ని చూస్తూనే పారిపోతోంది ఏమిటో?"

శంకరం వదనం గంభీరంగా మారిపోయింది.

"పాపం, చిన్నతనంలోనే భర్త పోయాడు. ఇప్పుడు తనవాళ్ళెవరూ సరిగా చూడటం లేదట."

"అది చాలా సహజ విషయమే, అంత సానుభూతి అవసరంలేదు రుక్మిణీ సంకెళ్ళు త్రెంచుకునే సాహసం లేని మూర్ఖుల గతి అలాగే వుంటుంది."

రుక్మిణి ఆశ్చర్యంగా చూసింది.

"మీరింత నిర్దయగా మాట్లాడడం నేనెప్పుడూ వినలేదు"

"నిర్దయ ఎప్పుడూ నా మనసున లేదు రుక్మిణీ. బాధ, అంతే. ఈ దేశపు ఆడవాళ్ళలో అధిక శాతానికి తమకేం కావాలో తెలియకపోగా, తమను బంధించి వుంచిన సంకెళ్ళను త్రెంచుకోవాలనే ప్రయత్నమూ, సాహసమే లేదు. పైగా ఆ సంకెళ్ళకు పవిత్రత అనీ, మరొకటనీ పెద్ద పెద్ద పేర్లు పెట్టుకు సంతోషించుతూ, ఎవరో తమను ప్రేమగా చూడలేదనీ, అదనీ, యిదనీ యిదౌతారు. ఎవరిని ప్రేమించేవారు వారికి ఉండాలి. అందరూ  అందరినీ ప్రేమించరు. అయినవాళ్ళే ఆదుకోరు"

"నాకు మీ మాటల అంతరార్ధమేమీ బోధపడటంలేదు. ఈరోజు చాలా క్రొత్తగా మాట్లాడుతున్నారు."

"అంతరార్ధం ఏమీలేదు. ఒకనాడు అందిన అవకాశాన్ని వినియోగించుకుని, ఆదుకొన వచ్చిన వారిని అవమానించి వుండకపోతే ఈనాడు నీ స్థానంలో నీ స్నేహితురాలు వుండేది. అందుకే అలా పారిపోయింది."

COMMENTS